
సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



ఈశ్వరీదేవి మఠం.. ఉత్సవ శోభితం
బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవి మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. - 8లో



ప్రేమను పంచి.. సేవలతో విస్తరించి..!
క్రిస్మస్ పండుగ అంటే క్రైస్తవుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి.జిల్లాలో ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. సేవలే ప్రధానంగా జిల్లాలో క్రైస్తవం విస్తరించింది. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.7 /19.9
జిల్లాలో సోమవారం 19.9 - 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

నేటి నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన



పులివెందుల రూరల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 24వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు పులివెందులలో పర్యటించనున్నారు. 24వ తేదీన ఉదయం 11 గంటలకు బెంగళూరు నుంచి ఇడుపులపాయ చేరుకుని దివంగత వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం ప్రేయర్ హాల్‌లో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఆ తర్వాత కడప నియోజకవర్గ నాయకులతో సమావేశమవుతారు. సమావేశం అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇడుపులపాయ నుంచి పులివెందుల బయలుదేరి వెళ్లి రాత్రికి అక్కడ నివాసంలో బస చేస్తారు. ఈనెల 25వ తేదీన ఉదయం 8.30 గంటలకు క్రిస్మస్ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు తాతిరెడ్డిపల్లిలో రామాలయాన్ని ప్రారంభించిన అనంతరం పులివెందుల చేరుకుని రాత్రికి బస చేస్తారు. ఈనెల 26వ తేదీ పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహిస్తారు. ఈనెల 27వ తేదీన ఉదయం 9 గంటలకు పులివెందుల విజయా గార్డెన్స్‌లో జరిగే వివాహానికి హాజరవుతారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి బెంగళూరు వెళతారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ



ఆలయం వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

లింగాల : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాతిరెడ్డిపల్లె గ్రామంలో పర్యటించనున్నారు. శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ట వేడుకలో ఆయన పాల్గొంటారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులతో, ఎస్ఐ మధుసూదనరావుతో ఎంపీ చర్చించారు. భద్రతా ఏర్పాట్లపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు మల్లికేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పుల్లారెడ్డి, జెడ్పీటీసీ పుష్ప, బ్రహ్మానందరెడ్డి, గంగాధర, మండల నాయకులు బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుర్చీ కోసం రగడ

- మళ్లీ రెచ్చిపోయిన కడప రెడ్డెమ్మ
- ఈసారి సభలోనూ మేయర్‌తో సమానంగా కుర్చీ వేయాలని ఎమ్మెల్యే మొండిపట్టు
- పార్టీ ఫిరాయింపు కార్పొరేటర్లదీ ఆమె మాటే..
- అరుపులు, కేకలు, నినాదాలతో దద్దరిల్లిన సభ
- కుర్చీ వేసేంత వరకూ సమావేశం జరగనివ్వబోమని ఎమ్మెల్యే రచ్చ
- ఎజెండాపై చర్చించాలని పట్టుబట్టిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- ఒకసారి వాయిదా పడిన నగరపాలక సర్వసభ్య సమావేశం
- మధ్యాహ్నం సెషన్‌లో అన్ని అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



ప్లకార్డు ప్రదర్శిస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప కార్పొరేషన్ : గతంలో జరిగిన నగర పాలక సమావేశంలో 'కుర్చీ' కోసం రెచ్చిపోయిన కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవీ రెడ్డి.. సోమవారం జరిగిన సమావేశంలోనూ 'కుర్చీ' కోసం కొట్లాటను కొనసాగించారు. తనకు కుర్చీ వేసేంత వరకూ నగర పాలక సర్వసభ్య సమావేశం జరగనివ్వను... అనేంతగా మొండి పట్టుదల ప్రదర్శించారు. ఆమె సభలో ఉన్న సుమారు 3 గంటలపాటు ఏ ఛైర్‌లోనూ కూర్చోకుండా నిల్చొనే ఉన్నారు. ఈ క్రమంలో 'నీవు అవినీతి పరుడివి' అంటూ మేయర్‌ను, 'మేయర్ బువ్వ పెడతాడు తినిరాపోండి, ఆడవాళ్లుగా పుట్టినందుకు సిగ్గుపడండి'.. అంటూ వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లపై పరుష పదజాలం ప్రయోగించారు. నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఫోటోలు తీయాలని తన సిబ్బందిని కనుసైగలతో ఆదేశిస్తూ వారిని బెదిరించారు. మేయర్, కార్పొరేటర్లపైకి గుడ్లు ఉరుముతూ దూసుకుపోయారు. ఈ క్రమంలో పలు సార్లు వాగ్వాదాలు, తోపులాటలు జరిగాయి. ఎమ్మెల్యే ప్రోద్బలంతో టీడీపీలోకి పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు కూడా రెచ్చిపోయారు. ఎజెండా చదువుతున్న ఉద్యోగి మైక్ లాక్కొనేందుకు పలుసార్లు ప్రయత్నించారు. ప్రతిసారీ చదువుతున్న ఎజెండా పేపర్లను లాక్కొని చించివేశారు. పార్టీ ఫిరాయించిన మహిళా కార్పొరేటర్లు దూసుకురావడంతో మేయర్ కుర్చీ కుదుపులకు గురైంది. ఇదిలా ఉండగా 'ఎజెండాకు ప్రాధాన్యమివ్వండి, ప్రజా సమస్యలపై చర్చించండి, సభా మర్యాదను పాటించండి, సీటు కోసం కాదు... ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాడండి... మేయర్ ఇంటివద్ద చెత్త వేసినందుకు క్షమాపణ చెప్పాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పోడియంపై నేల మీద కూర్చొని నిరసన తెలిపారు. మరోవైపు 'పూర్వ సాంప్రదాయం పాటించండి, మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడండి' అంటూ టీడీపీ కార్పొరేటర్లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రెండున్నర గంటలపాటు ఇదే రచ్చ నడిచింది. ఈ సందర్భంగా సభ జరగకుండా రచ్చ చేస్తున్న ఎక్స్ అఫిషియో సభ్యురాలు, ఎమ్మెల్యే మాధవి, 8 మంది ఫిరాయించిన కార్పొరేటర్లను సస్పెండ్ చేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. అయినా సభ నియంత్రణలోకి రాకపోవడంతో సభను మధ్యాహ్నానికి వాయిదా చేశారు.

మధ్యాహ్నం 2.30 గంటలకే సస్పెండ్ అయిన కార్పొరేటర్లు మేయర్ పోడియంపైకి ఎక్కి ఛైర్ వెనుక నిలబడి ప్లకార్డులు ప్రదర్శించారు. ఎమ్మెల్యేకు జరుగుతున్న అన్యాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. 3 గంటలకు సభ ప్రారంభం కాగానే ఎమ్మెల్యే మాధవి మైక్ తీసుకొని మాట్లాడుతూ మీరు మాత్రం మాంసం, చికెన్ తిని వచ్చి మీడియాకు, పోలీసులకు పప్పన్నం పెడతారా... మీకు సిగ్గులేదా...మీ ఇళ్లలోంచి డబ్బుతెచ్చి ఇస్తున్నారా.. ఆడవాళ్లుగా పుట్టినందుకు సిగ్గుపడండి అంటూ దూషించారు. దీనికి మేయర్, కార్పొరేటర్లు సమాధానమిస్తూ భోజన ఏర్పాట్లన్నీ కమిషనరే చూసుకుంటారని, అది తమకు సంబంధం లేని విషయమని తెలిపారు. ఇలా అరుపులు, కేకల మధ్యలోనే ఎజెండా అంశాలు అందరికీ ఇవ్వడం జరిగిందని, ఈ అంశాలను మీరు ఆమోదిస్తున్నారా...అని మేయర్ అనగానే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లంతా ఆమోదిస్తున్నాం... అంటూ చేతులెత్తారు. దీంతో ఎజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు మేయర్ ప్రకటించారు.



144 సెక్షన్ అమల్లో ఉన్నా ఎమ్మెల్యే కారుపై వేలాడుతూ బలప్రదర్శన చేస్తూ వస్తున్న టీడీపీ నాయకులు



మేయర్ కుర్చీ వెనుక వచ్చి ఎజెండా పేపర్లు విసిరేస్తున్న పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్ స్వప్న



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి



మధ్యాహ్నం సెషన్‌లో మేయర్ పోడియం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఫిరాయింపు కార్పొరేటర్లు

దేశంలో ఏ మేయర్‌కూ జరగని అవమానం జరిగింది

- ఎమ్మెల్యే పిలుపుతోనే ఆ పార్టీ నాయకులు నా ఇంటిపై చెత్త వేశారు
- నా విచక్షణాధికారంతోనే ఆనాడు ఎమ్మెల్యేకు కుర్చీ వేశాను... ఈనాడు తీసేశాను
- ఈ ఏడు నెలల్లో ఒక్క రూపాయి నిధులు తెచ్చారా...!
- ప్రభుత్వ విప్ మాధవి తీరుపై తీవ్రస్థాయిలో మండిపడిన మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : దేశంలో ఏ మేయర్‌కు జరగని అవమానం తనకు జరిగిందని, కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి పిలుపుతోనే ఆ పార్టీకి చెందిన టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు, పాలెంపల్లెకు చెందిన నాయకులు చెత్తను తెచ్చి తన ఇంటిపై వేశారని మేయర్ సురేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన జరిగిన తర్వాత ఎమ్మెల్యేగానీ, ఆమె భర్తగానీ పొరపాటు జరిగిందని చెప్పకుండా ప్రజలే వేశారని అహంకారంగా మాట్లాడారని గుర్తు చేశారు. సోమవారం సర్వసభ్య సమావేశం అనంతరం కార్పొరేషన్‌లోని తన ఛాంబర్‌లో మేయర్ మీడియాతో మాట్లాడారు. గతంలో తన విచక్షణాధికారంతోనే ఎమ్మెల్యేలకు తనతో సమానంగా కుర్చీలు వేదికపైన వేశానని, మాధవి కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కూడా ఆ కుర్చీలు వేదికపైనే ఉన్నాయని, ఎంతో మర్యాద ఇచ్చి పూల బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపామని ఫొటోలు ప్రదర్శించారు. రాష్ట్రంలో 12 కార్పొరేషన్లలో ఏ రూలు ఉందో ఇక్కడ కూడా అదే రూలు ఉందని తెలిపారు. కానీ ఎమ్మెల్యే మొదటి సమావేశంలోనే కార్పొరేటర్ ఉమాదేవిని ఆ డివిజన్ నీ జాగీరా...నిన్ను బొట్టుపెట్టి పిలవాలా అని పరుషంగా మాట్లాడిందని గుర్తుచేశారు. కార్పొరేటర్ల భర్తలను లోపలికి రానివ్వమంటే వారికి ప్రత్యేకంగా ఎలాంటి ప్రోటోకాల్ ఉండదని చెప్పారని గుర్తు చేశారు. చెత్తపన్ను రద్దు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందని, ఫలితంగా రాష్ట్రంలోని నెల్లూరు, చిత్తూరు, కర్నూల్, అనంతపురం వంటి అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో క్లాప్ ఆటోలు రద్దు చేశారన్నారు. కానీ కార్పొరేషన్‌కు భారమైనా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తాము 70 ఆటోలతో ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్నామని తెలిపారు. చిత్తశుద్ధితో తాము నగరాభివృద్ధిని కాంక్షిస్తున్నామని, టీడీపీ ఎమ్మెల్యే, నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారారని ఆరోపించారు. బుగ్గవంకపై బ్రిడ్జిలను ఆరునెలల్లో పూర్తి చేస్తామన్నారు...చేశారా... ఏడు నెలలైనా రీ టెండర్ పిలిచే గతి లేదని ధ్వజమెత్తారు. అభివృద్ధిని చూసి కార్పొరేటర్లు టీడీపీలోకి పోయారంట...సిగ్గుచేటు...వారిని భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి చేర్చుకున్నారని మండిపడ్డారు. మా పార్టీ బీ ఫారం ఇచ్చి వారిని కార్పొరేటర్లుగా గెలిపించాం ...ఈరోజు మాకు వెన్నుపోటు పొడిచినట్లే వారు ఏదో ఒకరోజు మీకు కూడా పొడుస్తారని హెచ్చరించారు. శాంతికి మారుపేరులాంటి కడపలో టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడి చేయించారని తెలిపారు. ఎన్నికల వరకే పార్టీలు ఉంటాయి...ఆ తర్వాత అందరం భాయి...భాయి అని కలిసిమెలిసి పోయేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి బ్రహ్మంసాగర్‌లో 1.50 టీఎంసీల నీటిని కేటాయిస్తూ జీవో తెచ్చామని, రూ.530 కోట్లతో టెండర్లు పిలిచి అగ్రిమెంట్ చేయిస్తే ఈ ప్రభుత్వం ఆ పనులను రద్దు చేయించిందని ఆరోపించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు కె. బాబు, అరీపుల్లా బాషా, చంద్రహాసరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు జహీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు



ఎమ్మెల్యే తీరుకు నిరసనగా కింద కూర్చుని నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కుర్చీ కావాలా... అభివృద్ధి కావాలా తేల్చుకో...!

- ప్రభుత్వ విప్ మాధవీపై మండిపడిన వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కుర్చీ కావాలో.. నగరాభివృద్ధి కావాలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి తేల్చుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లు సూచించారు. సోమవారం కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో జరిగిన రచ్చ నేపథ్యంలో వారు మీడియాతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు...మాటల్లోనే...

నిధులు వెనక్కిపోతాయి



మొదటి సమావేశంలో ఎమ్మెల్యే మాధవికి ఎంతో మర్యాద ఇచ్చాం. బొకేలు ఇచ్చి సన్మానించాం. ఆమె ఆ మర్యాదను నిలబెట్టుకోలేకపోయారు. ఎమ్మెల్యేగా ప్రజలకు అభివృద్ధి చేసి చూపాలి. ఈ సమావేశం జరక్కపోతే నిధులు వెనక్కిపోతాయి. అన్ని చోట్లా వర్కులు ఆగిపోతాయి. ఆమెకు కుర్చీ కావాలో, అభివృద్ధి కావాలో తేల్చుకోవాలి. మేయర్ పక్కన సీటు కావాలని గెజిట్ తెచ్చుకో.

- పత్తి రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యురాలు

ఎజెండా పేపర్లు చించడమేమిటి..



కుర్చీ వేయలేదని ప్రజా సమస్యలతో కూడిన ఎజెండా పేపర్లను ఎమ్మెల్యే చించివేయడం దారుణం. కార్పొరేటర్ల పక్కన కూర్చోవడానికి ఎమ్మెల్యే అవమానంగా భావిస్తూ...తన స్థాయి తగ్గుతుందని భ్రమపడుతోంది. ప్రజా సమస్యలపై ఆమెకు చిత్తశుద్ధి లేదు. కుర్చీ కోసం కాదంటారు..మళ్లీ అదే కుర్చీ కోసం రచ్చ చేస్తారు... ఏమిటిది?

- సి. నాగమణి, కార్పొరేటర్

ఏం అభివృద్ధి చేశావ్..



అసెంబ్లీలో స్పీకర్ పక్కన చంద్రబాబు కూర్చుంటున్నారా...ప్రజా సమస్యలపై చర్చించమంటే ఎజెండా పేపర్లు చించివేస్తారు...ఇదేం న్యాయం. మీ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైంది...ఏం అభివృద్ధి చేశావో చెప్పాలి. లక్షన్నర ఖర్చు చేసి మేయర్ ఇంటిపై చెత్త వేయించారు... మీరు ఒక్కరేనా మహిళ... మేయర్ సతీమణి మహిళ కాదా... వారి ఇంటిపై చెత్త వేస్తే వారెంత బాధపడతారో ఆలోచించండి.

- బండి మరియలు, కో ఆప్షన్ సభ్యురాలు

కుర్చీ కోసం కొట్లాట తగదు



ఎమ్మెల్యే మాధవి పేద ప్రజల సమస్యల గూర్చి ఆలోచన చేయాలి. ఏది మంచి.. ఏది చెడు బేరీజు వేసుకోవాలి. మేయర్ పక్కన సీటు వేసే సాంప్రదాయం ఎక్కడా లేదు. కుర్చీ కోసం కొట్లాడటం సరికాదు.

- నసీబా సుల్తానా, కార్పొరేటర్

న్యూస్‌రీల్

27న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి వాలీబాల్ పురుషులు/మహిళల విభాగం ఎంపికలు ఈనెల 27వ తేదీన ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ ఎస్. గౌస్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, 10 పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకు రావాలని సూచించారు. జాతీయస్థాయి పోటీలు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జనవరి 7 నుంచి 13వ తేదీ వరకు సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్న నేపథ్యంలో నేరుగా విజయవాడలో రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేడుకగా ప్రాకారోత్సవం



ప్రాకారోత్సవంలో శ్రీ పద్మావతి అమ్మవారు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారికి ఉత్తర నక్షత్ర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చి పంచామృతాభిషేకం, పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సహస్ర ధారాభిషేకాన్ని వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం అలంకరించిన ఉత్సవ మూర్తులను పల్లకీపై కొలువుదీర్చి మేళతాళాల మధ్య ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కేంద్ర మంత్రి పర్యటన

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ బుధవారం నుంచి మూడు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారని అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 9.30 గంటలకు కడప ఆర్ అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుని బస చేస్తారన్నారు. 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి బయలుదేరి 11 గంటలకు సీకే దిన్నె మండలం నాగిరెడ్డిపల్లెకు చేరుకుంటారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రజలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2 గంటలకు సీకే దిన్నె నుంచి బయలుదేరి 2.30 గంటలకు పెండ్లిమర్రి మండలం యల్లటూరుకు చేరుకుంటారు. అక్కడ ప్రకృతి వ్యవసాయం, ఫసల్‌బీమా యోజన లబ్ధిదారులు, ఉద్యాన పంటలను పరిశీలిస్తారు. పాడి రైతులు, వ్యాక్సినేషన్, మినీ గురుకులాలు, వాటర్ కన్జర్వేషన్ పరిశీలిస్తారు. డ్వాక్రా గ్రూపులతో సమావేశమవుతారు. రోడ్లు, డ్రైయిన్స్, పారిశుద్ధ్యం, ఇంటర్నెట్ కనెక్షన్, మొబైల్ కనెక్టివిటీని పరిశీలించి అక్కడి ప్రజలతో మమేకమవుతారు. సాయంత్రం 5.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 6 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. 7 గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, పౌరసంఘాల ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు. ఈనెల 27వ తేది యాస్పిరేషనల్ జిల్లా కార్యక్రమంపై అధికారులతో సమావేశమవుతారు. ఉదయం 11.30 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుండి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళతారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

కడప అగ్రికల్చర్ : కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని, అందుకోసం శాస్త్రవేత్తలు తమ సేవలను విస్తృతం చేయాలని గుంటూరు ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ శారద జయలక్ష్మి సూచించారు. సోమవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆమె సందర్శించి కేవీకే సాంకేతిక కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న రైతు అవసరాలకు అనుగుణంగా కేవలం వ్యవసాయ పంటలే కాకుండా ఉద్యాన, పాడి, కోళ్లు, గొర్రెలతోపాటు మేకల పెంపకంపై కూడా దృష్టి పెట్టి పెద్ద మొత్తంలో ఉత్పత్తిని చేపట్టాలని తెలిపారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సుమతి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం కార్యాచరణ ప్రణాళిక సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే కేవీకే నుంచి ఎక్కువ మంది వ్యాపార ఔత్సాహికులను తయారు చేయాలని తెలిపారు. అనంతరం వారు కేవీకే నమూనా క్షేత్రంలోని వర్మికంపోస్టు తయారీ కేంద్రాన్ని, చిరుధాన్యాలకు విలువ జోడింపు కేంద్రాన్ని, స్టాల్స్, యంత్ర పరికరాలను సందర్శించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. ప్రభాకర్‌రెడ్డి, ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కేవీకేలో శాస్త్రవేత్తలతో కలిసి స్టాల్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ శారద జయలక్ష్మి

జిల్లాలో సుపరిపాలన కొనసాగాలి

జేసీ అదితిసింగ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : సమర్థవంతమైన పాలన, ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా చేపట్టిన గుడ్ గవర్నెన్స్ వీక్ క్యాంపెయిన్ కార్యక్రమాలు జిల్లాలో నిర్విరామంగా కొనసాగిస్తూ ప్రజలకు నమ్మకమైన సుపరిపాలనను అందించాలని జేసీ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఈ నెల19 నుండి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న 'గుడ్ గవర్నెన్స్ వీక్' (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్ లో భాగంగా.. సోమవారం కలెక్టరేట్ లోని సభాభవన్‌లో జెడ్పీ సీఈవో, 'గుడ్ గవర్నెన్స్ వీక్' నోడల్ అధికారి ఓబులమ్మ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ గుడ్ గవర్నెన్స్ అంటే ప్రభుత్వం తన ప్రజలకు సమర్థవంతంగా, పారదర్శకంగా, జవాబుదారీతో సేవలు అందించే విధానం అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న 'ప్రశాసన్ గావోన్ కి ఓర్- 2024' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా జరిగే గుడ్ గవర్నెన్స్ వీక్ (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే సోమవారం వర్క్ షాప్‌ను నిర్వహించామన్నారు. జెడ్పీ సీఈవో, 'గుడ్ గవర్నెన్స్ వీక్' నోడల్ అధికారి ఓబులమ్మ మాట్లాడారు. జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన పెంచే.. కార్యక్రమాల వివరాలను పిపిటి ద్వారా క్షుణ్ణంగా వివరించారు.

గడువులోపు ఫిర్యాదుల పరిష్కారం

ప్రజా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని జేసీ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె అర్జీలు స్వీకరించారు.

- సోమశిల ముంపునకు గురైన తమకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇంటికొక ఉద్యోగాన్ని ఇస్తామని నెల్లూరు జిల్లా పర్యవేక్షక ఇంజనీరు 364 మందితో జాబితాను తయారు చేశారని ముంపు బాధితులు తెలిపారు. అయితే గత 40 ఏళ్ల నుంచి ఇప్పటివరకు జాబితాలోని ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని రామస్వామి, గుత్తికొండ మహేష్ అనే దళారులు తమను మోసగించారని ఆరోపించారు. తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవడంతోపాటు దళారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.
- జమ్మలమడుగులోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్‌గా, ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న రామకృష్ణారెడ్డిని విధుల నుంచి తప్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. ఆయన నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడిందన్నారు. దొమ్మర నంద్యాల గ్రామానికి చెందిన విద్యార్థి హాస్టల్ నుంచి పారిపోయాడని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆయనను తొలగించాలన్నారు.
- తన భర్త చనిపోవడంతో ఆస్తి తమకు దక్కకుండా భర్త అన్నదమ్ములే ఆన్‌లైన్ చేసుకున్నారని చెన్నూరు మండలం చిన్నమాచుపల్లెకు చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.
- కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు 28 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్ రోడ్స్ : జిల్లాలోని 28 గ్రామాలలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని దిరసవంచ, గోపాలపురం, సింగరాయపల్లి, ముద్దిరెడ్డిపల్లి, సిద్ధవరం, పిట్టిగుంటలో సదస్సులు నిర్వహించనున్నారు. అలాగే పులివెందుల రెవిన్యూ డివిజన్ లోని సురభి, అచవెల్లి, మద్దులపాయ, పాలూరు, వేంపల్లె-8, నల్లచెరువుపల్లి, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని తుమ్మలపాడు, రామచంద్రాపురం, మోరగుడి, యనమలచింతల, కొత్రపాడు, చిన్నవెంతుర్ల, జె. కొట్టాలపల్లి, రాజుపాలెం మండలం సోమపురం(హాబిటేషన్), కడప రెవెన్యూ డివిజన్‌లోని రుద్రభారతిపేట, చింతకొమ్మదిన్నె, కడప, ఎర్రగుడిపాడు, చీమలపెంట, సిద్ధవటం, పైడికాల్వ, కోనరాజుపల్లిలో సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో తెలిపారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెండ్లిమర్రి : కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని నంది మండలం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మృతుడు రెండు రోజుల క్రితం నందిమండలం గ్రామంలో తిరుగుతుండేవాడన్నారు. నందిమండలం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన మృతదేహం కనిపించడంతో స్థానిక వీఆర్‌ఓ రామచంద్రారెడ్డికి గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోడంతో మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

హ్యాండ్‌బాల్ స్టేట్ రన్నరప్‌గా కడప జట్టు



రన్నరప్ ట్రోఫీతో వైఎస్సార్ కడప జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

కడప స్పోర్ట్స్ : పొట్టిశ్రీరాములు జిల్లా కొవ్వూరు మండలంలోని పాటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన 53వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో వైఎస్సార్ కడప జిల్లా జట్టు రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. రాష్ట్రంలోని 16 జిల్లాల జట్లు తలపడగా, కడప జట్టు తొలిమ్యాచ్‌లో విశాఖపై 7–3 స్కోరుతో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. అనంతరం క్వార్టర్ ఫైనల్స్‌లో కర్నూలుపై 8–5 స్కోరుతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్‌లో కడప జట్టు నెల్లూరుపై 13–2 తేడాతో విజయం సాధించి ఫైనల్ చేరింది. ఫైనల్‌మ్యాచ్‌లో సత్యసాయి జట్టుతో హోరాహోరీగా తలపడి పరాజయం చెంది రెండోస్థానంలో నిలిచినట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి. లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జిల్లా జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందజేశారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి. లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు రాధారాణి, భారతి, రవి, రాజశేఖర్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం .. స్మగ్లర్ అరెస్టు

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా బాలపల్లి అటవీ ప్రాంతంలో మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బాలపల్లి అటవీ ప్రాంతంలోని గుంజనా సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. గంగరాజుపల్లి సమీపంలోని సున్నపురాళ్ల కోన వద్ద ఒక వ్యక్తి తచ్చాడుతూ కనిపించగా అతన్ని పట్టుకుని విచారించారు. మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు తెలిపారు.

ప్రేమను పంచి.. సేవలతో విస్తరించి..!



కడపలోని సీఎస్‌ఐ హైస్కూల్



కడపలోని నిర్మల జనరల్ హాస్పిటల్



కడపలోని డాన్‌బాస్కో ఐటీఐ

- జిల్లాలో సేవా మార్గంతో ప్రజలకు చేరువైన క్రైస్తవం
- క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక కథనం

కడప కల్చరల్ : క్రిస్మస్ పండుగ అంటే క్రైస్తవుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి. ఈ పండుగను ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహ ఉల్లాస భరితంగా నిర్వహిస్తారు. జిల్లాలో కూడా ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. సేవలే ప్రధానంగా జిల్లాలో క్రైస్తవం విస్తరించింది. క్రిస్మస్ సందర్భంగా ఆ వివరాలు..

మన జిల్లాలో క్రైస్తవులు దాదాపు 17 నుంచి 20 శాతం వరకు ఉన్నారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఖాజీపేట, బద్వేలు, కలసపాడు, పోరుమామిళ్ల, కమలాపురం తదితర ప్రాంతాలలో క్రైస్తవుల సంఖ్య గణనీయంగా ఉంది. 1800 సంవత్సరం నుంచి ఈ ప్రాంతంలో క్రైస్తవం బాగా విస్తరించింది. జిల్లాలోని ఉరుటూరులో తొలి చర్చి నిర్మించారు. కడప నగరంలో పాత రిమ్స్ వద్దగల కాంగ్రిగేషనల్ చర్చి నగరంలో తొలి చర్చిగా రికార్డుల్లో ఉంది. జమ్మలమడుగులోని క్యాంబెల్ చర్చి, కలసపాడు, పోరుమామిళ్ల, పులివెందుల తదితర ప్రాంతాలలో చర్చిలను ఎంతో ఘనంగా నిర్మించారు. ప్రేమ, అహింస, దయ, కరుణకు మారుపేరుగా నిలిచిన ఏసుక్రీస్తును ఆరాధించే వారి సంఖ్య జిల్లాలో బాగా పెరిగింది. కడప నగరంలో కెథడ్రిల్ చర్చి, సీఎస్‌ఐ సెంట్రల్ చర్చి, ఆరోగ్యమాత చర్చి, అత్యాధునిక వసతుల సౌకర్యాలతో ప్రశాంత నిలయాలుగా పేరుగాంచాయి. కార్పొరేషన్ కార్యాలయం వద్దగల క్రైస్ట్ చర్చి నాటి తరం పటిష్ట నిర్మాణ శైలికి నిదర్శనంగా నిలిచి ఉంది.

విద్యను అందిస్తూ..

జిల్లాలో క్రైస్తవాన్ని ప్రజలు ఆదరించారు. కర్ణాటక ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చిన నాటి క్రైస్తవ గురువులు, ప్రచారకులు ఒకవైపు ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ మరోవైపు విద్యాలయాలు, వైద్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. కేవలం కడప నగరంలోనే సీఎస్‌ఐ, మరియాపురం హైస్కూళ్ల ద్వారా ఇప్పటికి వేలాది మంది బడుగు, బలహీన, పేద, అణగారిన వర్గాల వారి పిల్లలకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారు. నిర్మల కాన్వెంట్ ద్వారా ఆధునిక విద్యను అందించి 'మిషనరీ స్కూళ్లు క్రమశిక్షణకు మారుపేరు' అనిపించుకున్నాయి. అలాగే జిల్లాలో అప్పటి నుంచి నేటి వరకు దాదాపు 50కి పైగా పాఠశాలలు క్రైస్తవ సంస్థల యాజమాన్యంలో విజయవంతంగా నడుస్తున్నాయి.

వైద్యంతో ప్రాణాలు నిలుపుతూ..

కడప నగరంలో క్రైస్తవులు ఏర్పాటు చేసిన నిర్మల ఆస్పత్రి అత్యాధునిక వైద్య పరికరాలు కలిగి ఉండి ఉత్తమ వైద్యం అందిస్తుందని పేరు తెచ్చుకుంది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యపరంగా పెద్ద సమస్యలను ఎదుర్కొనే వారు ఈ ఆస్పత్రికి వచ్చి చూపించుకునే వారు. ఇందులో శస్త్ర చికిత్సలు కూడా నిర్వహించేవారు. జమ్మలమడుగులో అప్పట్లో నిర్మించిన క్యాంప్‌బెల్ ఆస్పత్రి నేటికీ వైద్య సేవలు అందిస్తోంది. క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించడం, మొండివ్యాధులను సైతం నయం చేయడంలో మంచి పేరు సాధించింది. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ఆస్పత్రి నుంచే వైద్యుడిగా సేవలు ప్రారంభించారు.

పేదలకు అండగా నిలిచి..

చర్చిల నిర్మాణంతోపాటు క్రైస్తవ సంస్థలు జిల్లాలో అనాథలు, వృద్ధులు, రోగులు, వికలాంగులకు ప్రత్యేకంగా శరణాలయాలు ఏర్పాటు చేసి సేవలు అందించాయి. దాదాపు ప్రతి మండలంలోనూ ఇలాంటి సంస్థలు ఉన్నాయి. కడప నగరంలోని సంధ్య సర్కిల్‌లో ఆంథోని ఇండస్ట్రీస్‌లో డాన్‌బాస్కో ఐటీఐ ఏర్పాటు చేసి యువతకు సాంకేతిక విద్యను కూడా అందుబాటులోకి తెచ్చారు. వేలాది మందిని నిపుణులుగా తీర్చిదిద్దారు. ఇలా విద్య, వైద్య, సాంకేతిక సంస్థల ద్వారా మానవతా గుణాన్ని చాటుకుంటూ క్రైస్తవం మన ప్రాంతంలో విశేషంగా ఆదరణ పొందింది.

సాధారణ చార్జీలతో సంక్రాంతి సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సాధారణ చార్జీతోనే ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. పండుగ సందర్భంగా హైదరాబాదుకు 111, బెంగళూరుకు 81, విజయవాడకు 30, చెన్నైకు 12, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురానికి 60 బస్సులు నడుస్తాయన్నారు. జనవరి 9 నుంచి 13వ తేదీ వరకు బస్సులు ఉంటాయన్నారు.

ఘర్షణపై కేసు నమోదు

సింహాద్రిపురం : మండలంలోని బలపనూరు గ్రామంలో ఆదివారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాల వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బలపనూరు గ్రామంలో ఇంటి స్థలం విషయమై ఘర్షణ పడటంతో ఒక వర్గానికి చెందిన 10 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, అలాగే మరో వర్గానికి చెందిన ఏడు మందిపై హత్యాయత్నం నమోదు చేసి వారిని రిమాండుకు తరలించామన్నారు.

రేపు రూట రాష్ట్ర ఉర్దూ కాన్ఫరెన్స్

కడప ఎడ్యుకేషన్ : కడప వినాయకనగర్‌లోని సిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 25వ తేదీ రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) రాష్ట్ర ఉర్దూ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు రూట రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమాం బాషా, సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. రూట రాష్ట్ర శాఖ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉర్దూ విద్యారంగ పటిష్టతకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంపై చర్చిస్తామన్నారు.

జర్నలిస్టులకు క్రీడలు అవసరం

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



జర్నలిస్టులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : నిత్యం సంఘర్షణతో కూడిన వృత్తిలో ఉన్న జర్నలిస్టులకు మానసిక ప్రశాంతత కోసం క్రీడలు అన్ని విధాలుగా ఉపయోగపడతాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జర్నలిస్టు శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ (జేశాప్) జిల్లా మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా జేశాప్ క్రీడా జర్నలిస్టులకు వేదికగా ఉండటం అభినందనీయమన్నారు. జేశాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్ కిశోర్‌లతోపాటు జేశాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, పాల్గొన్నారు. అనంతరం జేశాప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలి



విలేకరులతో మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

కడప సెవెన్‌రోడ్స్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై సాక్షాత్తు పార్లమెంటులోనే అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. షా వ్యాఖ్యలపై సోమవారం ఏపీ ఎమ్మార్పీఎస్ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించడమంటే భారత రాజ్యాంగాన్నే హేళన చేయడమని తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగం రచించినందున షా మంత్రి అయ్యారన్న విషయాన్ని మరిచిపోరాదన్నారు. భవిష్యత్తులో ఎవరు ఇలాంటి వ్యాఖ్యలు చేసినా సహించబోమని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, డప్పు చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు రమణ, ఓబులేశు, నాగరాజు, రామయ్య పాల్గొన్నారు.

ఈశ్వరీదేవి మఠం.. ఉత్సవ శోభితం

- వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు
- భారీగా తరలి వస్తున్న భక్తులు
- ఘనంగా ఏర్పాట్లు



విద్యుత్ దీప అలంకరణలో ముఖద్వారం



అశ్వవాహనంపై అమ్మవారి ఊరేగింపు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవి మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. దేవాలయానికి రంగులతో మెరుగులద్దారు. దేవాలయంతోపాటు పరిసరాలను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ఆకట్టుకునేలా ముఖద్వారాన్ని తీర్చిదిద్దారు. ఆరాధనోత్సవాల్లో రెండో రోజైన సోమవారం వేడుకలు కమనీయంగా నిర్వహించారు. ఈశ్వరీదేవికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు చేపట్టారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిమఠం రెసిడెన్షియల్ స్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో చేపట్టిన చెక్క భజన భక్తులను అలరించింది. కందిమల్లాయపల్లెలోని వీరనారాయణపురం వారి గోవిందమాంబ కోలాటం బృందం చేసిన కోలాటం ఆకట్టుకుంది. మధ్యాహ్నం ఉత్సాహ భరితంగా అశ్వవాహనోత్సవం జరిగింది. అమ్మవారు అశ్వవాహనంపై ఆశీనులై భక్తులను ఆశీర్వదించారు. సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సంగీత విభావరి ప్రదర్శించారు. రాత్రి హంస వాహనోత్సవం కనుల పండువగా జరిగింది. ఉభయ దాతలుగా బద్వేలు మండలం కుమ్మరకొట్టాలుకు చెందిన గోవిందిన్నె సుబ్బరాయుడు ఆచారి, విజయలక్ష్మి, విజయవాడకు చెందిన గుంటముక్కల ఉమామహేశ్వరరావు, నిర్మల, బ్రహ్మంగారిమఠం మండలం బొగ్గులవారిపల్లెకు చెందిన బొగ్గుల ఈశ్వర నారాయణరెడ్డి, శారదాంబ, గోవిందరెడ్డి, నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన వంక వేణుగోపాల్, సుగుణమ్మ, బ్రహ్మానందరెడ్డి, సునీత దంపతులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ వారు అల్పాహారం పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ఆశీస్సులతో ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో దేవదాయ శాఖ, మఠం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో శ్రీ ఈశ్వరీమాత సేవా సమితి ట్రస్టు చైర్మన్ కమ్మరి పార్వతమ్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, న్యాయ సలహా కమిటీ చైర్మన్ గురుప్రసాద్, షరాబు చంద్రమౌళి ఆచార్యులు, రాష్ట్ర మహిళా కమిటీ గౌరవాధ్యక్షురాలు వాసవి, అధ్యక్షురాలు అంగల కుదుటి సుశీల, ఉపాధ్యక్షురాలు షరాబు రమాదేవి, ప్రధాన కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రధాన వేడుక

ఈశ్వరీదేవి 1789లో మార్గశిర బహుళ నవమి నాడు సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఏటా అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది బహుళ నవమి మంగళవారం ప్రధాన వేడుక నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఇప్పటికే అధిక సంఖ్యలో చేరుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పిస్తారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఇందులో మఠాధిపతి దంపతులు పాల్గొంటారు. మధ్యాహ్నం జగన్మాతకు దీక్షా బంధన అలంకరణ ఉంటుంది. రాత్రి సింహవాహన గ్రామోత్సవం, తులాభారం, సహస్ర దీపాలంకరణ తదితర కార్యక్రమాలు ఉంటాయి.

వైవీయూలో నియామకాలు



నియామక పత్రాలను అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో పలు విభాగాలకు నూతన కోఆర్డినేటర్లను, నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తూ వైస్–ఛాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సాయంత్రం వీసీ చాంబర్‌లో వీసీ, రిజిస్ట్రార్‌లు అధ్యాపకులకు నియామకపు పత్రాలను అందజేశారు.

వైవీయూ డెవలప్‌మెంట్ సెక్షన్ కోఆర్డినేటర్‌గా బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె. రియాజున్నీసా నియమితులయ్యారు. ఈ స్థానంలో ఇదివరకు పనిచేస్తున్న జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉస్మాన్ బాషా బాధ్యతల నుంచి రిలీవ్ కానున్నారు. వైవీయూ ఫైనాన్స్ విభాగం కోఆర్డినేటర్‌గా కామర్స్ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. హరనాథ్‌ను నియమించారు. ఇదివరకు ఈ స్థానంలో పనిచేసిన వాణిజ్య విభాగం శాఖ ఆచార్యులు జి. విజయ భారతి పదవీ కాలం పూర్తి కావడంతో ఈ నూతన నియామకం చేశారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో 'స్వయం ప్లస్ (ఆన్‌లైన్ కోర్సులు)' అమలుకు నోడల్ ఆఫీసర్‌గా విశ్వవిద్యాలయంలోని జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.పి.వెంకటరమణను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి. సరిత పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రాలకు కిట్లు



చౌటపల్లె అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువులను అందిస్తున్న మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిక చేసిన 60 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.60 లక్షలతో పిల్లల ఆట వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మి తెలిపారు. వైఎస్సార్ జిల్లాకు సంబంధించి చౌటపల్లె, నరసింహాపురం అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం ప్లే మెటీరియల్, జారుడు బండ, 8.2 లీటర్ల రైస్ కుక్కర్, ఐరన్ ర్యాక్, వేయింగ్ స్కేల్, 32 ఇంచ్‌ల టీవీతో పాటు మొత్తం 30 రకాల వస్తువులను అందించారు.

విద్యార్థి కాలిపై బ్లేడ్‌తో కోసిన ప్రిన్సిపల్

రాయచోటి : కళాశాలలో స్టడీ అవర్‌కు రావడం లేదని కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ ఇంటర్ విద్యార్థి కార్తీక్ కాలుపై బ్లేడుతో కోశాడు. పెట్టాడు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గాయపడిన విద్యార్థిని ఆసుపత్రికి తరలించారు. రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో భాగమైన ఇంటర్మీడియట్ కళాశాలలో కార్తీక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొద్ది రోజులుగా సాయంత్రం వేళ కళాశాలలో జరుగుతున్న స్టడీ అవర్‌కు కార్తీక్ రాకపోవడం పట్ల ప్రిన్సిపల్ మందలించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో సోమవారం సాయంత్రం స్టడీ అవర్‌కు వచ్చిన కార్తీక్ పట్ల ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు బ్లేడుతో కాలిపై కోసినట్లు విద్యార్థి పోలీసులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



షబానా (ఫైల్)

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. కడప శంకరాపురం రామాంజనేయపురం వడ్డేపల్లెకు చెందిన సాబ్‌జాన్ భార్య చెట్టూరి షబానా(29) బెంగళూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఈనెల 16న కడపకు బయలుదేరింది. మార్గ మధ్యంలో మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో దిగి కనిపించకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లేకపోవడంతో సోమవారం షబానా తండ్రి బంధూషా టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్‌ఐ గాయత్రి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగిసిన కళ్లద్దాల టెండర్ల ప్రక్రియ

రాయచోటి (జగదాంబసెంటర్) : జాతీయ అంధత్వ, దృష్టి లోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బడికి వెళ్లే విద్యార్థుల్లో అంధత్వం, దృష్టి లోపం నివారణ కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 3200 కళ్లద్దాల కోసం ఈ నెల 14న టెండర్ నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అందిన దరఖాస్తులను సోమవారం ఉదయం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొక్యూర్మెంట్ కమిటీ తనిఖీ చేసిందన్నారు. తక్కువ కొటేషన్ ఇచ్చిన రాయచోటికి చెందిన మస్తాన్‌కు 3200 కళ్లద్దాల తయారీ పనిని అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

టెంపో వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : టెంపో వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. మహారాష్ట్రకు చెందిన షేక్ లతీఫ్(55) మదనపల్లె అమూల్ డెయిరీ నుంచి సామగ్రి తీసుకెళ్లేందుకు వచ్చాడు. వాహనాన్ని లోడింగ్ నిమిత్తం డెయిరీలో పార్క్‌చేసి ఎదురుగా ఉన్న రోడ్డుపై నడిచి వెళుతుండగా, చింతామణి నుంచి మదనపల్లెకు క్యారెట్ లోడ్‌తో వచ్చిన ఐచర్ టెంపో లతీఫ్‌ను ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది.


విద్యుత్ షాక్‌తో రైతు మృతి



మృతి చెందిన రైతు రుద్ర శివానందరెడ్డి

వేంపల్లె : వేంపల్లె మండలం టి.వెలమవారిపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రుద్ర శివానందరెడ్డి (40)అనే రైతు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఉదయం 6 గంటలకు చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన రుద్ర శివానందరెడ్డి అనే రైతు 12 ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దీనిలో అరటి, నిమ్మ పంటలను సాగు చేశాడు. అరటి పంటకు మందు కొట్టేందుకు నీరు అవసరం కాగా, సోమవారం ఉదయం రంగారెడ్డి అనే వ్యక్తితో కలిసి రుద్ర శివానందరెడ్డి అరటి తోట వద్దకు వెళ్లాడు. వ్యవసాయ బోరుకు చెందిన మోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రుద్ర శివానందరెడ్డికి తెగిన విద్యుత్ వైర్లు చేతికి తగిలి విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో కింద పడిపోవడంతో అతన్ని కాపాడబోయిన రంగారెడ్డికి కూడా విద్యుత్ షాక్ కొట్టడంతో పెద్దగా కేకలు వేశారు. పక్క పొలంలో ఉన్న అతని అన్న వెంకట్రామిరెడ్డి కేకలు విని సంఘటన స్థలానికి వచ్చి గమనించి విద్యుత్ సిబ్బంది సమాచారం ఇచ్చాడు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి చూడగా అప్పటికే రైతు రుద్ర శివానందరెడ్డి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య రమాదేవితోపాటు తిరుపతి రెడ్డి, ప్రకాష్ రెడ్డి, రెడ్డి నవీన్ రెడ్డి అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. రైతు మృతితో టి.వెలమవారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి రైతు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకొని అమ్మకాలలో జరుగుతున్న మోసాలను అరికట్టాలని డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఎంతో కష్టపడి కొన్న వస్తువు నాణ్యత లోపిస్తే వారు ఎంత మనస్తాపానికి గురవుతారో గ్రహించి అలాంటి మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రసూల్, జిల్లా ఇన్‌చార్జి పౌరసరఫరాల శాఖ అధికారి రెడ్డి చంద్రిక, ఆహార కల్తీ నిరోధక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి షంషీర్ ఖాన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అర్జున్ రావు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ కమ్ అడ్వైజర్ పి.రమేష్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

కొత్త బోట్లను మంజూరు చేయాలని వినతి

సాక్షి ఎఫెక్ట్..

కడప కల్చరల్ : దేవుని(పాత)కడప చెరువులో కొత్త బోట్లను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రముఖులు, సినిమాటోగ్రఫీ, టూరిజం, కల్చరల్ మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందజేశారు. దేవునికడప చెరువులో బోటింగ్‌కు బ్రేక్ పడిన విధానం, బోట్లు లేకపోవడంతో ఆదాయం కోల్పోతున్న అంశంపై ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన స్థానికులు జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి దుర్గేష్‌ను కలిసి దేవునికడప చెరువును అభివృద్ధి చేయాలని, అందులో భాగంగా నూతన బోట్లను మంజూరు చేయాలని కోరారు. వీటితోపాటు చెరువు కట్టను ఆధునీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేయాలన్నారు. ఇందుకు మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టగలమని హామీ ఇచ్చారు.